క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఉరుసు ఉత్సవాలు ప్రారంభం



గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద కొండపై ఉన్న ముస్తఫావలి అవులియా దర్గా ఉరుసు ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మహబూబ్ సుభానీ జెండా చెట్టు వద్ద నుంచి ప్రారంభమైన భక్తుల ఊరేగింపు హైస్కూల్ రోడ్డు, మసీద్ సెంటర్, సూరంపల్లి రోడ్డు, దక్షిణం బజారు, గీతా మందిరం, వెదురుపావులూరు, కో–ఆపరేటివ్ బ్యాంకు, చిన్న ఎస్సీ కాలనీ మీదుగా కొనసాగింది. ముజావర్ల ఇంటి నుంచి ఫకీర్ల ఖవాలీలు, మేళతాళాలు, జెండాలతో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. దర్గా వద్దకు చేరుకున్న భక్తులు చాదర్ సమర్పించారు. సాయంత్రం దీపారాధన, అన్నదానం జరిగింది. మీలాద్‌లో భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చికిత్స పొందుతూ పెయింటర్ మృతి

పెనమలూరు: భవనానికి రంగులు వేస్తూ, ప్రమాదవశాత్తు పెయింటర్ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తెరా శ్యామ్‌బాబు(26) పెయింటర్‌గా పని చేస్తాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతను ఈ నెల 13న కానూరులో ఇంటికి రంగులు వేయటానికి వెళ్లాడు. అక్కడ పరంజా ఎక్కి రంగులు వేస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అత్యవసర చికిత్సకై చేర్చారు. చికిత్స పొందుతున్న శ్యామ్‌బాబు మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధి



పోరంకిలో బాధితులకు ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు సీఎం సహాయనిధి కింద ఎల్‌వోసీని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందజేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వణుకూరు గ్రామానికి చెందిన డి.శ్రీనివాసాచారి, కోలవెన్నుకు చెందిన చొప్పకట్ల ధనలక్ష్మిలకు వైద్యం కోసం ఆస్పత్రి ఖర్చులకు సీఎం సహాయనిధి నుంచి ఎల్‌వోసీ అందించారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, పెనమలూరు, కంకిపాడు పార్టీ అధ్యక్షులు కోయా ఆనంద్‌ప్రసాద్, సూదిమళ్ల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పార్లమెంటేరియన్ సీతారామ్ ఏచూరి



పెనమలూరు: కామ్రేడ్ సీతారామ్ ఏచూరి ఉత్తమ పార్లమెంటేరియన్ అని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. యనమలకుదురు సీపీఎం కార్యాలయంలో గురువారం సీతారామ్ ఏచూరి సంతాపసభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న నరసింహారావు మాట్లాడుతూ.. సీతారామ్ ఏచూరి ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి అని, సీపీఎంకు ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. ఆయన పార్లమెంట్‌లో 294 ప్రసంగాలు చేశారని, 90 శాతం హాజరయ్యారని తెలిపారు. మోదీ ప్రభుత్వంలో సీతారామ్ ఏచూరికి ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు లభించిందన్నారు. సీతారామ్ ఏచూరి ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్.కాశిం మాట్లాడుతూ సీతారామ్ ఏచూరి వంటి నాయకుడు నేటి యువతరానికి ఆదర్శమన్నారు. సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, నాయకులు షేక్.మస్తాన్‌వలి, షేక్.షరీఫ్, పాతాళలక్ష్మి, ప్రజాసంఘాల నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుబజారు నిర్వీర్యమేనా?

- అధికార పార్టీ నిర్ణయాలతో అథోగతి
- దళారీ వ్యాపారుల రంగప్రవేశమే కారణం
- పాత మార్కెట్ వ్యాపారుల చేతికి రైతుబజారు ?
- అదే జరిగితే రైతుబజారు ఉన్నా లేనట్టే !



రైతుబజారులో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



కంకిపాడు రైతుబజారు

కంకిపాడు: అధికార పార్టీ అడ్డగోలు నిర్ణయాలతో రైతుబజారు నిర్వీర్యం కానుందా? అంటే అవుననే సంకేతాలే వ్యక్తమవుతున్నాయి. నిన్నటి వరకూ రైతులు, దుకాణదారులకు పరిమితమైన రైతుబజారులో టీడీపీ అండదండలతో దళారీ వ్యాపారులు రంగప్రవేశం చేయనున్నారు. అదే జరిగితే వారి పెత్తనం ఎక్కువై రైతుబజారు సామాన్యులకు దూరం అవుతుందనే వాదన వినిపిస్తోంది.

కంకిపాడు లాకురోడ్డులో ఉన్న పాత కూరగాయల మార్కెట్‌లో ధరల హెచ్చు కారణంగా పేద, మధ్య తరగతి వర్గాలు కూరగాయాలు కొనే పరిస్థితి లేని రోజులు. అదే క్రమంలో కూరగాయలు పండించిన రైతులకు సరైన ధర దక్కని దుస్థితి. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా స్థలాన్ని మార్కెటింగ్ శాఖకు బదలాయింపు చేయటంతో దశాబ్ద కాలంపైగా కంకిపాడు పరిసరాల్లో ఉన్న సుమారు 40 గ్రామాల ప్రజలకు, రైతులకు రైతుబజారు అందుబాటులోకి వచ్చింది.

దళారీ వ్యాపారుల చేతికి..

ఇప్పటి వరకూ సుమారు 50 వరకు దుకాణాలు రైతుబజారులో ఉన్నాయి. డ్వాక్రా, సొసైటీ దుకాణాలు లక్ష్యంగా టీడీపీకి చెందిన దళారీ వ్యాపారులు రంగంలోకి దిగారు. తమ వద్ద కూరగాయలు కొనుగోలు చేయాల్సిందేనని, లేకపోతే దుకాణాలు ఉండవంటూ హెచ్చరించటం, సాక్షాత్తూ రైతుబజారు ప్రాంగణంలోనే ఈ తంతు జరగటం తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ టీడీపీకి చెందిన వ్యాపారుల వద్ద కొనుగోలు చేయాల్సిందేనంటూ దుకాణదారులకు చెప్పటం ఇక్కడ కొసమెరుపు. దీంతో రైతుబజారు దుకాణదారులు దిక్కుతోచని స్థితిలో లబోదిబోమంటున్నారు. పాత కూరగాయల మార్కెట్‌పై పెత్తనం సాగించే దళారీ వ్యాపారి ప్రస్తుతం రైతుబజారులో వ్యాపారం సాగించేందుకు చాపకింద నీరులా పావులు కదుపుతున్నారు. దుకాణదారులను బెదిరింపు కూరగాయలు కొనిపించి వారికి నామమాత్రంగా మార్జిన్ ఇచ్చి అందినకాడికి లాభాలను పోగేసుకోవాలని చూస్తున్నారు.

వ్యాపారుల ఇష్టారాజ్యం..

మరో వైపు పాత మార్కెట్‌లో దుకాణాలు ఉన్న ముగ్గురు వ్యాపారులకు రైతుబజారులో దుకాణాలు కేటాయించినట్లు తెలుస్తోంది. దీనికి తోడు తాజాగా అధికార పక్షం తమ పార్టీకి చెందిన వ్యాపారుల వద్దే కూరగాయలు కొనాలన్న నిర్ణయంతో రైతుబజారుపై పూర్తిగా పాత కూరగాయల మార్కెట్ ఆధిపత్యం పెరగబోతుందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే రైతులు పండించే కూరగాయలు ఇక్కడ అమ్ముకునే పరిస్థితి ఉండదని, వ్యాపారుల ఇష్టారాజ్యంతో కూరగాయల ధరలు ఆకాశాన్నంటే అవకాశం ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాలి



టీ షర్టులు అందుకున్న క్రీడాకారులతో రమణ, కిశోర్

గన్నవరం: ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్, సీనియర్ న్యాయవాది కేవీ రమణ పిలుపునిచ్చారు. స్థానిక కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 20వ తేదీ శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్ కిశోర్ సౌజన్యంతో టీ షర్ట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారని చెప్పారు. వీరిని వెలుగులోకి తీసుకువచ్చేందుకు జిల్లా స్థాయిలో మూడు రోజుల పాటు పోటీలను జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు రూ.60 వేలు నగదు బహుమతులతో పాటు షీల్డ్స్ అందజేయనున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయి పోటీలను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు కిశోర్ తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు మూడు రోజుల పాటు ఉచిత భోజన సదుపాయం కూడా కల్పించినట్లు చెప్పారు. ఈ పోటీలను విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని కోరారు. అసోసియేషన్‌కు చెందిన పీడీ చందు, నిడమర్తి బుజ్జారావు, పల్లమోతు రమేష్, చిమట రవివర్మ, ఋషి పాల్గొన్నారు.

నున్నలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



నున్నలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వరదల కారణంగా ఇప్పటికీ పలు కాలనీల్లోని స్కూళ్లు, ప్రార్థనా మందిరాల్లో మురుగు నీరు నిల్వ ఉండడంతో పారిశుద్ధ్య సిబ్బంది సున్నం, బ్లీచింగ్ చల్లుతున్నారు. వరద ప్రాంతాల్లో దుర్వాసన వస్తున్న నేపథ్యంలో ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా ఉండే విధంగా బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు. వరద నీటిలో జంతు కళేబరాలు కొట్టుకొచ్చిన తర్వాత దుర్వాసన వస్తున్నట్లు ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను బట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పల్లపు ప్రాంతాల్లో నీరు పోవడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు. గ్రామ శివారు ప్రాంతాల్లో బుడమేరు వరద ప్రవాహం అధికంగా ఉండడంతో అపార్టుమెంట్ల చుట్టూ నిల్వ ఉన్న మురుగుతో దుర్వాసనలు వస్తున్నాయని స్థానికుల నుంచి ఫిర్యాదు వస్తున్నాయన్నారు. ఈ మేరకు పారిశుద్ధ్య చర్యలను చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

స్వచ్ఛభారత్ కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ



కానూరు సిద్ధార్థలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ వెంకటేశ్వరరావు, విద్యార్థులు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ విద్యార్థులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపడుతున్నట్లు వైస్ చాన్సలర్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కాలేజీలో గురువారం వీసీ వెంకటేశ్వరరావు, కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నరేంద్ర మాట్లాడుతూ.. తమ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నెహ్రూ యువకేంద్రం సహకారంతో స్వభావ స్వచ్ఛత-సంస్కార స్వచ్ఛత కార్యక్రమం చేపడుతున్నారన్నారు. ఇందులో భాగంగా ప్లాస్టిక్ వస్తువులు సేకరించటం, స్వచ్ఛ క్లాస్ రూమ్‌లు, స్వచ్ఛ హాస్టల్, క్యాంపస్, గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దటం, పబ్లిక్ ప్రాంతాల్లో శుభ్రం చేయటం, సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజల్లో అవగాహన పెంచటం, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 2వ తేదీన మచిలీపట్నం బీచ్ శుభ్రం చేస్తారని చెప్పారు.

ఏలూరు కాలువ గండ్లు పూడ్చాలని రైతుల ధర్నా



బుద్దవరం(గన్నవరం): ఏలూరు కాలువకు పడిన గండ్లను వెంటనే పూడ్చి వేయాలని రైతు సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని బుద్దవరం ఆర్బీకే వద్ద రైతు సంఘ నేతలు ధర్నా నిర్వహించారు. రైతు సంఘ నాయకులు సూరగాని సాంబశివరావు మాట్లాడుతూ.. ఇటీవల సంభవించిన వరదలకు కేసరపల్లి వద్ద ఏలూరు కాలువకు భారీ గండి పడిందన్నారు. దీనివల్ల కేసరపల్లి దిగువున ఏలూరు కాలువలో నీటి పారుదల లేక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువకు గండ్లు పూడ్చి పూర్తిస్థాయిలో సాగునీటిని విడుదల చేయాలని కోరారు. సంఘ నేతలు మల్లంపల్లి ఆంజనేయులు, బడుగు మరియదాసు, గండికోట దశరథ రామయ్య, నక్క రామయ్య, వెంకటరామయ్య, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

గన్నవరం: రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.ఉమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన సెలక్షన్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థినులు మాతంగి రితిక, పుట్టా కీర్తిని జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇద్దరు విద్యార్థినులు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వారిని, పీఈటీలను అధ్యాపక బృందం అభినందించింది.

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు: ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లోని అబ్దుల్ కలాం నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఈ నెల 28వ తేదీ నుంచి స్వయం ఉపాధి శిక్షణ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబర్, కారు, మోటార్ సైకిల్ రిపేర్ విభాగాల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. కోర్సు 90 రోజులు ఉంటుందని, 18–35 ఏళ్ల వయసు ఉండి 10వ తరగతి చదివిన వారు అర్హులని చెప్పారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశం, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. 94409 25583, 90104 23652 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు



ఫ్లోరెన్స్ కుమారి దంపతులను సన్మానిస్తున్న రాఘవప్రసాద్, ఉపాధ్యాయులు

రామవరప్పాడు: విధుల్లో అంకితభావంతో పని చేస్తే గుర్తింపు లభిస్తుందని దాత త్రిపురనేని రాఘవ ప్రసాద్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని తాతాపురం ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయురాలు కె.జె. ఫ్లోరెన్స్ కుమారి పదవీ విరమణను పురస్కరించుకుని గురువారం తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా ఫ్లోరెన్స్, రాజారత్నం దంపతులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. రాఘవ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులను సన్మార్గంలో నడిపించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే ఉపాధ్యాయుల కృషి విలువకట్టలేనిదన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోదావరి సత్యవాణి మాట్లాడుతూ.. ఫ్లోరెన్స్ ఉపాధ్యాయురాలు తన 38 సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పారన్నారు. క్రమశిక్షణ, ఉన్నత విలువలు, సద్గుణాలు విద్యార్థుల్లో పెంపొందించడానికి కృషి చేశారని కొనియాడారు. అనంతరం తోటి ఉపాధ్యాయులు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, ఇందిరా, వరలక్ష్మి, భాను, వినీషావాణి తదితరులు పాల్గొన్నారు.

వణుకూరులో పోషకాహార మాసోత్సవాలు



వణుకూరులో సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న హెచ్ఎం రఘురామ్



విద్యార్థినులకు రక్త పరీక్షలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మిసునీత

పెనమలూరు: వణుకూరు గ్రామంలో గురువారం పోషకాహారం మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులు చేపట్టిన సైకిల్ ర్యాలీని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురామ్ ప్రారంభించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. పోషకాహారంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సూచించారు. సంపూర్ణ ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యవంతంగా ఉండవచ్చని చెప్పారు. అనంతరం విద్యార్థినులకు రక్త పరీక్షలు చేశారు. హిమోగ్లోబిన్ పెరగటానికి ఆహారంలో ములగాకు, ఆకుకూరలు తినాలని ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మిసునీత విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దసరా మహోత్సవాలకు వీఎంసీ సిద్ధం



అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ మూడు నుంచి 12వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాలకు విజయవాడ నగరపాలక సంస్థ సిద్ధంగా ఉందని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో దసరా ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీఎంసీ చర్యలు తీసుకుంటోందన్నారు. భక్తులకు కావాల్సిన తాగు నీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, క్లాక్ రూంలు, పారిశుద్ధ్య నిర్వహణ, గుడి వరకు వెళ్లే రోడ్లకి ప్యాచ్ వర్కులకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 35 లక్షల వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు, 150 తాత్కాలిక మరుగుదొడ్లు, ఆరు క్లోక్ రూములు ఏర్పాటు చేస్తామని, 27 ప్రాంతాల్లో 1400 మంది పారిశుద్ధ్య కార్మికులతో మూడు షిఫ్టుల్లో పారిశుద్ధ్య పనులు చేపడ్తామని వివరించారు. దసరా ఉత్సవాలు జరిగినన్ని రోజులు ఆయా విభాగాల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూంలో 24 గంటలు పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు వెళ్లే గిరి ప్రదక్షిణ దారిలో ప్యాచ్ వర్క్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో మాదిరి ఈ సారి కూడా భవాని భక్తులు వదిలి వెళ్లే వస్త్రాల సేకరణకు ఘాట్లలో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేశామని, ఘాట్ల నుంచి వ్యర్థాల తరలింపునకు 18 ట్రాక్టర్లను వినియోగిస్తామని తెలిపారు.

ముగిసిన ఐడీఈ బూట్ క్యాంప్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న గౌరి గోపినాథ్, రాంబ్రహ్మం

ఉంగుటూరు: యువత వ్యవస్థాపకులుగా మారడానికి అవసరమైన నైపుణ్యాలతో ప్రేరేపించడమే లక్ష్యంగా ఐడీఈ బూట్ క్యాంపులు నిర్వహిస్తోందని వాద్వాని ఫౌండేషన్ నోడల్ ఆఫీసర్ గౌరి గోపినాథ్ అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల ఐడీఈ బూట్ క్యాప్ గురువారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇన్నోవేషన్, డిజైన్, ఎంటర్ పెన్యూర్‌షిప్(ఐడీఈ) బూట్ క్యాంపును నిర్వహించేందుకు ఎంపిక చేసిన భారతదేశంలోని 10 నోడల్ సంస్థలలో ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఒకటన్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్స్, ఇన్నోవేషన్ సెల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, వాద్వాని ఫౌండేషన్ ద్వారా నిర్వహించారు.

సామాజిక ప్రాజెక్ట్ చేపట్టాలి..

ఈ బూట్ క్యాంప్‌ల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని పీఎం ఎస్‌హెచ్‌ఆర్ఐ పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులను భవిష్యత్తులో ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులుగా మారడానికి అవసరమైన నైపుణ్యాలతో ప్రేరేపించడం, సన్నద్ధం చేయడం లక్ష్యంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం కస్టమర్ డిస్కవరీ వర్క్‌షాప్ నిర్వహించారు. స్టూడెంట్ స్టార్టప్‌ల కోసం గ్రాంట్స్, పెండింగ్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఏఐసీటీఈ మేనేజర్ డాక్టర్ ఐ.ఎస్ బీయ మాట్లాడుతూ శిక్షణ ముగిసిన తరువాత తమ ప్రాంతాల్లో ఒక చిన్న సామాజిక ప్రాజెక్ట్‌ను చేపట్టాలని, కొంత మంది వ్యక్తులను భాగస్వాములను చేయడానికి ప్రయత్నం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాద్వాని ఫౌండేషన్ రిసోర్స్ పర్సన్ దిప్తి, ఎస్ఐఈ ఎంఏటీ నోడల్ ఆఫీసర్ ప్రసాద్‌రాజు, కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకే ఎస్వీ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోరంకిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: పోరంకిలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పోరంకిలో గురువారం కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులు, విద్యార్థులతో కలిసి స్వచ్ఛతా హి సేవాపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మానవహారం చేసి ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం



ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న జీఎం శైలేష్‌కుమార్, డీజీఎం మనీష్‌కుమార్‌సింగ్

కేసరపల్లి(గన్నవరం): ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకుగాను శాఖలను విస్తరిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ శైలేష్ కుమార్ తెలిపారు. మండలంలోని కేసరపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ బ్రాంచ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేసే లక్ష్యంతో ఎస్‌బీఐ ముందుకు వెళ్తోందన్నారు. దీనిలో భాగంగా నూతన బ్రాంచ్‌లు ఏర్పాటుతో పాటు ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రజలు సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంక్ సర్వీస్‌లకు సంబంధించిన ఓటీపీలు, మేసేజ్‌లను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని తెలిపారు. ఎస్‌బీఐ డీజీఎం మనీష్‌కుమార్‌సింగ్, నార్త్ రీజనల్ మేనేజర్ ఆర్.రాఘవరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

25 నుంచి అమ్మవారి చీరల వేలం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరల వేలం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి యువి.ప్రసాదారావు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఆలయంలో అమ్మవారి చీరల బహిరంగ వేలం ఈ నెల 25, 26, 27 తేదీలలో భక్తులు, పెద్దల సమక్షంలో ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు బహిరంగ చీరల వేలంలో పాల్గొనాలని కోరారు.

3 నుంచి చినకంచిలో దసరా ఉత్సవాలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారి దేవస్థానం చినకంచిలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు శ్రీకామాక్షి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు శ్రీకామాక్షి అమ్మవారికి అలంకరణ వివరాలు వెల్లడించారు. 3న శ్రీబాలాత్రిపుర సుందరీదేవి, 4న శ్రీ మహాలక్ష్మిదేవి, 5న శ్రీ గాయత్రి దేవి, 6న శ్రీ అన్నపూర్ణా దేవి, 7న శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి, 8న శ్రీకామాక్షిదేవి, 9న శ్రీ సరస్వతీదేవి(మూల నక్షత్రం), 10న శ్రీదుర్గా దేవి (దుర్గాష్టమి), 11న శ్రీ మహిషాసుర మర్దినీదేవి, 12న శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిస్తారన్నారు. అమ్మవారికి ప్రతి రోజూ అలంకారాలు, అర్చనలు, పారాయణలు, హోమాలు, ఖడ్గ మాల కుంకుమ పూజలు జరుగుతాయని చెప్పారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.